# నగరం నవ్వుతోంది!

## -భాగవతుల సుబ్రహ్మణ్యం

సిక్స్ ఇయర్స్ స్పాన్....

కేవలం-ఆరేళ్ల కాలంలో, నగరాలు ఇంత కొత్తగా గుర్తుపట్టలేనంతగా మారిపోతాయని మన్మధరావ్ అనుకోలేదు. పట్టణాలూ-నగరాలూ గ్రామాల కంటె త్వరగా పెరిగిపోతూం టాయని గ్రహించలేని అమాయకుడూ-అజ్ఞానీ కాడు గాని, విత్ ఇన్ ఓన్లీ సిక్స్ ఇయర్స్... భాగ్యనగరం ఇప్పుడు అతడు గతంతో పోల్చి చూసుకుని, ఆశ్చర్యపోవడమే కాదు! కించిత్ కలవర పడ్డాడు కూడా!

నైంటీవన్‌లో-నగరానికి మన్మధరావు మొదటిసారి వచ్చినపుడు, అతడికి ఆకాశహర్మ్యాలు అధికసంఖ్యలో తారసపడలేదు. భారీ అంతస్థుల బిల్డింగులు పదీ-పాతికా ఉన్నా, అవి అతడ్ని ఏమాత్రమూ ఆశ్చర్యప రచలేదు. దానిక్కారణం-అతడు ట్రయినింగ్ రీత్యా ఇన్నాళ్లు బొంబాయిలో ఉండటమే! అక్కడ వీటికి బాబు ల్లాంటి-బాబాయిల్లాంటి బహుళ అంతస్థుల భవనాలు అడుగడుగునా చూసి ఉండటమే! కాని, ఇప్పుడీ హైదరా బాద్‌లో అడుగు పెడుతూనే, సబర్బన్ ఏరియాలతో సహా చాలా చోట్ల ఈ మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్ కుప్పలు తెప్పలుగా అతడిని పలకరించడంతో విస్తుబోయాడు. అగ్గిపెట్టె ల్లాంటి అపార్ట్‌మెంట్స్‌లో నివాస దౌర్భాగ్యం, ఈ భాగ్యనగ రానికీ దాపురించిందన్నమాట!...అని మనసులోనే అను కున్నాడు.

నాలుగేళ్లనాడు మన్మధరావు ఏదో చుట్టపుచూపులాగ ఓ నాల్రోజులు తెల్సిన వాళ్లింట్లో వుండి వెళ్లడానికి మాత్రమే వచ్చాడు. ఎక్కడో దూరపు చుట్టరికం ఉన్నప్ప టికీ, అంతకంటే ఆత్మీయ స్నేహ భావాలే ఎక్కువగా పెన వేసుకున్న రంగబాబాయ్ పదే పదే అదే పనిగా ఉత్తరాలు రాస్తూంటే, హైదరాబాదొసారి చూసినట్టుంటుందని వచ్చాడు మన్మధరావు. అప్పుడంటే-బాబాయ్ ఆఫీసు జీప్‌లో ఎడా పెడా తిరిగేశాడు కనుక తన పరిశీలనలోకి అంతగా రాలేదు గాని...ఈసారి స్టేషన్లో దిగిన దగ్గర్నుంచీ అతడికి ప్రతి సంఘటనా అప్పటికన్నా ఇప్పుడు చాలా వింతగానూ-విచిత్రంగానూ అన్పించసాగింది!

మన్మధరావు ఇప్పుడు హైదరాబాద్ వచ్చింది-కేవలం ఏదో చూసి పోడానిక్కాదు! ఉద్యోగ రీత్యా, కుటుంబంతో సహా కొన్నాళ్లిక్కడ ఉండటానికే!

స్టేషన్లో దిగి-బైటకు రాగానే, మొదటిసారి స్టన్ అయి పోయాడు...ఆటోల వాళ్ల దగ్గర. 'బొంబాయి టోపీ'గా ప్రసిద్ధి కెక్కి, మోసాలకి పర్యాయపదంగా మారిపోయిన ముంబై దోపిడీని మించిపోయిందీ హైదరాబాద్ ఆటోల దోపిడీ అని తక్షణమే అర్థం చేసుకున్నాడు.

''మీటర్ పే పాంచ్ రూపై జ్యాదా దేనా పడేగా!'' (మీటర్ మీద కంటే ఐదు రూపాయలు ఎక్కువివ్వాలి!) ''క్యా హై జీ! ఉత్ నా దూర్ జా కే, ఫిర్ వాపసీ గిరాకీ, హమ్‌కో నహీ మిల్తీ!'' (అంతదూరంపోయినా, అట్నుంచి మాకు బేరాలు దొరకవు!) ''కూకట్‌పల్లీ?!..జ్యాదా దూర్ హై! మై నహీ ఆతూం'' (బోల్డు దూరం వుంది. నేను రాను)...ఈ ఉర్దూ మిక్స్‌డ్ గత్తర భాషకి- ఓ పక్క చెవుల తుప్పొదిలి పోతూంటే, వాళ్ల నిర్లక్ష్య ధోరణికి ఒళ్లు మండి పోసాగింది మన్మధరావ్‌కి.

ఎట్టకేలకు-ఇతడ్ని చాలా సేపట్నుంచి అబ్జర్వ్ చేస్తూ ఉన్న ఓ ఆటోవాలా ''మై ఆతూం సాబ్!'' అంటూ, తానే స్వయంగా ఆటో ఆఫర్ చేయడంతో-''హమ్మయ్య! వీళ్లలో కూడా కాస్త మంచివాళ్లున్నారన్న మాట!'' అనుకు న్నాడు మన్మధరావు.

ఇద్దరు పిల్లలూ, భార్యా-తానూ మొత్తం నలు గురు.......

''టు సీట్ ఫోర్ ఓన్లీ'' అని ఆటోమీద ఉన్నట్టుగానే, దాని కెపాసిటీకి సరిపడా ఉండగా అర్థంపర్థం లేని రీతిలో ఎక్కువ అడిగిన వాళ్లని తిట్టుకుంటూ; ఈ ఆటోవాలాని మెచ్చుకుంటూ లోపల కూర్చున్నాడు సంసారంతో సహా.

ముందు రంగబాబాయ్ ఇంటికెళ్లి, రెండ్రోజులు రెస్టు తీసుకుని సాయంత్రం పూట ఇళ్లు చూస్తూ-ఏదో ఒకటి సెటిల్ చేసుకుని అప్పుడు ఆఫీస్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడం....ఈలోగా పార్శిల్ లారీలో రాబోయే సామాన్లు తెచ్చుకుని నీట్‌గా సర్దుకోవడం...ఇదీ అతడి ఉద్దేశం. అందుకే సింపుల్‌గా వచ్చాడిప్పుడు-మినిమమ్ లగేజ్‌తో.

స్టేషన్ నుంచి ప్యారడైజ్ వరకూ వెళ్లేసరికి, ఆటోలో పెట్రోలయి పోయింది. రోడ్డు పక్కకి తీసి ఆపి ''బీస్ రూపై దేదో సాబ్! పెట్రోల్ భర్‌కే చలేంగే హమ్!'' అన్నాడు ఆటోవాలా.

మన్మధరావు భార్య కుమారి అనుమానంగా చూసింది.

''పోనియ్! పాపం! బేరాల్లేవేమో! మనదే మొదటి గిరాకీకాబోలు! పెట్రోలయిపోతే అతడు మాత్రం ఏం చేస్తాడు? ఎలాగూ మీటర్ మీదే వస్తానన్నాడు గదా! మిగి లిన డబ్బులు ఇచ్చేస్తాలే!'' కళ్లతోనే ఆమె భావాలు చదివే సిన మన్మధరావు మాటలతో జవాబిచ్చాడు కుమారికి.

అతడికి బాలానగర్-బోయిన్‌పల్లి మీదుగా కూకట్ పల్లి రూట్ బాగా గుర్తుంది. స్టేషన్ నుంచి పారడైజ్ దగ్గర రైట్ టర్న్.

...అదీ గుర్తే! కాని పెట్రోలు పోసి కదిలాక ఆటో లెఫ్ట్‌కి టర్నయి రాణిగంజ్ వైపు దూసుకుపోతూంటే, వుండబట్టలేక అడిగేశాడు మన్మధరావు- ''ఇటెందుకు తిప్పావేయ్! రూట్ అది కదా!'' అని!...

ఆటోవాడికి తెలుగు వచ్చునని, ఈమాట అర్థం చేసు కోవడం వల్ల తేలిపోయింది. కాని-తెలుగు మాట్లాడ్డం ఇష్టం లేదని అతని జవాబే చెప్పేసింది.

''వో రస్తా అచ్చానహీ జీ! గాడీ కో తక్లీఫ్ దేగా!..అవుర్ గిరాక్ కో భీ!'' (''ఆ దారి బాగులేదు. బండికీ-ఎక్కినవాళ్లకీ కూడా కష్టం!'')

తనకి తెలిసీ, తెలుగులో మాట్లాడితే- ఇతడికి ఇంకా అలుసైపోవచ్చునని ''మగర్ ఏ రస్తా బహుత్ దూర్ హై నా?.... మీటర్ భీ హమ్‌కో జ్యాదా పడేగా'' (ఈ దారి దూరం కదా! మాకు మీటర్ ఛార్జి ఎక్కువైపోతుంది'')

మన్మధరావు ఆ మాట ఇలా పూర్తి చేశాడో-లేదో ఆటో వాడు బీడీ వెలిగిస్తూనే బండి నిలిపేశాడు. ''అరె! ఆప్ కైకు నహీ సమజ్ తే? ఐసా హై తో ఉతరో! అవుర్ ఏక్ గాడీ పకడ్‌కే చలే జావ్!'' (అరె! మీరెందుకు అర్థం చేసుకోరు? ఇల్లాగైతే మీరు దిగిపోయి, వేరే ఆటో తీసు కుని దాన్లో పొండి!'')

మౌనమే శరణ్యం- అదే శ్రేయస్కరం అనుకుంటూ ''చల్ నే దో'' అని మాత్రం ఊరుకున్నాడు మన్మధరావు.

ఎలాగైతేనేం- చిన్నా పెద్దా ఆలస్యాలతో కూకట్‌పల్లి చేరేసరికి గంటన్నర పట్టింది. ఆటో మీటరు కూడా బహు ఉదారంగా తిరిగి ముప్ఫయ్యెనిమిదిన్నర దగ్గర ఆగింది. చిల్లర లేదని సవిలాసంగా సెలవిస్తూ మన్మధరావు ఇచ్చిన ఇరవైనోటు జేబులోకి తోసేస్తూ అన్నాడు ఆటోవాలా.

''ఆటోకి నలభై రూపాయలైంది మొత్తం'' ఇంట్లో కొస్తూనే కుమారి అన్నమాటలు విన్న రంగబాబాయ్ సంగతంతా అడిగి తెల్సుకుని ఒకటే నవ్వు! ..నవ్వా అది? అట్టహాసం అనాలి!..కాని, దాన్ని గుబురుమీసాల చాటున గుంభనగా దాచుకుంటూన్నా వైనాన్ని పసి గట్టక పోలేదు మన్మధరావు.

రెండుమూడుసార్లు తెరలుతెరలుగా అలా నవ్వి'' వాడు మిమ్మల్ని చాలా తెలివిగా మోసం చేశాడోయ్!'' అన్నారు-కొంతసేపటికి. దాన్ని వివరిస్తూ ''నువ్వు స్టేషన్లో దిగి నాల్గయిదు ఆటోల్ని వాకబు చెయ్యడంతోనే, నీ వాలకం కనిపెట్టేశాడు. మీటరు మీద ఐదు రూపాయలు ఎక్స్ట్రా ఇచ్చి వచ్చేస్తే పాతిక్కిమించదు..''అనడంతో

''ఔరా! టోకరా!'' అనుకున్నాడు.

అలా మన్మధరావు నగరంలో అడుగు పెడుతూనే జరిగిన మొదటి సంఘటనకి, నగరం తమాషాగా నవ్వు కుంది!

అదే రోజు సాయంత్రం-మన్మధరావు అమాయకత్వానికి మరోసారి జాలిగా నవ్వుకుంది!

అదేమిటంటే...

మన్మధరావు రెండో కొడుకు డుంబుగాడు కాస్త అల్లరీ-హుషారూ కూడా! పొద్దున్న ఇలా వచ్చాడో లేదో అప్పుడే రంగబాబాయ్ ఆఖరి కొడుక్కి ఉచితంగా ఓ నాలుగ్గుద్దులు ప్రసాదించేశాడు-చిన్న పేచీ పెట్టుకుని. మనపిల్లలే కదా అని సరిపెట్టుకున్నారు-ఇంట్లో కనుక.

బైటివాళ్లెందుకు ఊరుకుంటారలా?....సాయంత్రం పక్కింటి వాళ్ల కుర్రాడి క్కూడా, ఇలాగే వడ్డించబోతే-వాడు చేతిలో ఉన్న క్రికెట్ బ్యాట్‌తో ఒక్కటంటే ఒక్కటి గట్టిగానే డుంబుగాడి తలమీద ఇచ్చుకున్నాడు.

కొట్టేసి వాడు పారిపోయాడు.......

కళ్లు తిరిగి వీడు కిందపడిపోయాడు..

రంగబాబాయ్ పిల్లలు ఆ సంగతి ఇంట్లో చెప్పగానే, ''తల మీద దెబ్బని అశ్రద్ధ చెయ్యడానికి వీల్లేదు. గట్టిగానే తగిలి ఉంటుంది! పిల్లాడు వేళ్లాడిపోతూన్నాడు. అర్జెంటుగా ఆర్థోపెడిక్‌కి పదండి!'' అంటూ తానే స్వయంగా వెహికల్ డ్రయివ్ చేసి తీసుకొచ్చి ఆస్పత్రిలో చూపించారు-రంగబాబాయ్.

అసలే బాబాయ్ మాటల్తో భయపడి సగం బెంబేలెత్తిపోయిన మన్మధరావు, అక్కడి సర్జన్ మాటలకి ఇంకా బిక్కచచ్చిపోయేడు.

ఆయనేమన్నాడంటే-''ఫర్వాలేదనుకోండి! కాని బ్యాట్ దెబ్బకదా! బ్లడ్ క్లాటరింగ్ వంటిదేమైనా జరిగితే?! ఎందుకైనా మంచిది. సి.టి.స్కానింగ్ చేయించి రిపోర్ట్ తీసుకురండి!'' అని.

ఆలోచిస్తూన్న మన్మధరావుతో ''ఇదో గొప్ప వైద్య పరీక్షసార్! ఇటీవల ఇలాంటి అధునాతన పరికరాలు వాడకంలోకొచ్చాక, రోగ నిర్ధారణ పూర్వం కంటె ఖచ్చితంగానూ-సరైన సమయంలోనూ ఎంతో మెరుగ్గా చేసే వీలు కలిగింది మాకు! అఫ్‌కోర్స్! అది మీకూ మేలే అనుకోండి! మున్ముందు ఈ దెబ్బవల్ల ఎలాంటి ఎఫెక్ట్స్ ఏవీ ఎదుర్కోకుండా ఉండాలంటే..పోతే పోయాయ్ గానీ- ఓ పదిహేడువందలు ఖర్చయితే నేం? స్కానింగ్ రిపోర్ట్ తీసుకురండి!'' అని చెప్పడంతో, అతి సుకుమారంగా పెరిగిన బాబాయ్ కూడా సర్జన్నే సమర్థించడంతో, ఆ డబ్బు కట్టి డుంబూకి స్కానింగ్ చేయించక తప్పింది కాదు!

ఓ మెడికల్ లీజింగ్ సంస్థ, సోఫిస్టికేటెడ్‌గా దోచేయడానికి పెట్టుకున్న ఫక్తు వ్యాపార పర్పస్ డయాగ్నసిస్ సర్వీసెస్ వాళ్ల దగ్గర కెళ్లక తప్పలేదు. 'సీమెన్స్' కంపెనీ తయారు చేసిన ఈ అధునాతన వైద్య నిర్ధారణ పరికరం బాడీలోని ఏ చిన్న డిఫెక్ట్ ఉన్నా పట్టిచ్చే మాట నిజమే గానీ, ఫీజుమాత్రం దారుణం! (అలా ఎందుకనుకోవాలి? 'సేవ' అంటూ కూర్చుంటే-అంత ఖరీదైన పరికరాల కొనుగోలు ఖర్చు ఎవడిస్తాడు?) ఒకరకంగా ఇది-వెరీ వెరీ మైన్యూట్ డిటెయిల్స్ ఇచ్చే ఎక్స్‌రే పరికరం లాంటిది. మధ్య తరగతి మారాజులే దీనికి మహారాజు పోషకులు. వాళ్ల సంఖ్యే ఈ మహానగరంలో అధికం కావడంతో, సదరు స్కానింగ్ మెషిన్‌కి క్షణం తీరికలేకపోయింది. కనీసం అరడజను గ్రాఫిక్ రిపోర్ట్స్ తీసేందుకు, ఓ అనుభవజ్ఞుడి పర్యవేక్షణలో అయిదారుగురు ఆపరేటర్లు ఓ గంట టైం తీసుకోవలసి ఉండడంతో అపాయింట్ మెంట్ సిస్టమ్ బయల్దేరింది. దాంతో-ఎవరికి వారికే తొందర. అందులో మళ్లీ పైరవీలూ..రికమెండేషన్లూ..తన 'కేసే' ముందు స్కానింగ్ చెయ్యాలని! బాబాయ్ పలుకుబడితో ఎలాగో అర్థరాత్రి రెండుగంటలకి, డుంబూ తల స్కానింగ్‌కి అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది!



అర్థరాత్రి..నడి శీతాకాలం..దానికి తోడు ఈ ఆపరేటస్ చాలా సున్నితమైనవీ-ఇరవై నాలుగ్గంటలూ ఎ.సి.లో ఉండాల్సినవీనూ అట! దాంతో, గడ్డకట్టుకుపోయే చలిలో రాత్రంతా జాగరణ చేసి- ఆ స్కానింగ్ ఘట్టం ముగించుకొని, వాళ్లిచ్చిన రిపోర్టేదో మర్నాడు సర్జన్‌గారికి చూపిస్తే, ఆయన చాలా సింపుల్‌గా ''మరేం ఫర్లేదండీ! దెబ్బ పైపైనే తగిలింది. ఇంకొంచెం డీప్‌గా తగిలితే బ్రెయిన్‌కి ఎఫెక్ట్ ఇచ్చేదేమోగాని..నౌ ఇట్స్ ఓ.కె!'' అనేసి ''చూశారా! ఇది మామూలు దెబ్బ అని మనకిప్పుడు తెలిసింది గనుక సరిపోయింది. అదే-తెలీకుండా గట్టి దెబ్బ తగిలి ఉంటే....ఫ్యూచర్లో ఏ ఎపిలెప్సీయో-ఏ బెల్స్ పాల్సీయో-తరచుగా ఫిట్స్ రావడమో ఇలాంటివి జరిగితే......కారణం అర్థం కాక మనం ఎంత బాధపడే వాళ్లం! బట్....ఇప్పుడింకేం ప్రాబ్లెం లేదు. హి ఈజ్ ఆల్ రైట్'' అంటూ, డుంబుగాడి భుజం తట్టి, తన సజెషన్ని సమర్థించుకున్నారా సర్జన్‌గారు.

''ఓరి-వీడి చోద్యం పాడుగానూ! ఏం పిదపకాలమో-ఏమో! ఇంతకంటె గట్టిదెబ్బలే తిని, ఉక్కుపిడుగుల్లా ఇన్నేళ్ళూ బతికున్నామా లేదా?...నా చిన్నప్పుడు చింతపిక్క మందం ఉండి-కుంచెడు బియ్యం ఉడికే దుక్కలాంటి ఇత్తడిగిన్నె అటక మీంచి నా తలమీద పడి-ఆ తర్వాత కిందబడి సొట్టబోయింది. ఉసిరికాయంత బొప్పికట్టి, ఒక రోజంతా నొప్పెట్టింది! ఇలా పరుగులు పెట్టేమా? ఇప్పుడు ప్రతిదానికీ వందలూ-వేలూనూ...మందులకి కాదు-వైద్య పరీక్షలకట!'' ఏమాత్రం కల్మషం లేకుండా ఉన్నదున్నట్టు అనేసి నిండుగా బోసినోటితో నవ్వుతున్నారు రంగబాబాయ్ బామ్మగారు..సహస్ర మాస జీవి-తొంభైరెండేళ్ల ముసలావిడ.

మొదట ఆటో సంఘటన విని, గుంభనగా నవ్వేసిన బాబాయ్ నాగరీకపు నవ్వుకీ-ఇప్పుడీ స్కానింగ్ సంఘటన విని నిష్కల్మషంగా కల్తీ లేకుండా నవ్వేసిన బామ్మగారి అమాయకపు బోసినవ్వుకీ- ఎంత తేడా ఉందో మొట్టమొదటిసారిగా అంచనా కడుతున్నాడు మన్మధరావు..బొంబాయిలో అసలిలాటివేవీ పట్టించుకొనే తీరిక లేని బిజీ బిజీ ప్రపంచంలో ఉండి వచ్చినందున, ఇప్పుడు దొరికిన తీరిక అతడికో జ్ఞానోదయం కలిగించింది!

''తెలిసీ-తెలియకా...రెండు విధాలా నగర జీవి నిత్యం మోసపోక తప్పదు'' అనేదే సదరు పాఠం.

''బాబాయ్ లౌక్యపునవ్వుకీ-బామ్మగారి బోళానవ్వుకీ ఉన్నంత తేడా గ్రామాలకీ-నగరాలకీ ఎప్పుడూ ఉంటుంది'' అని ఇప్పుడిప్పుడే బోధపడుతూన్న మన్మధరావుని చూసి నగరం పగలబడి నవ్వుతోంది!

విరగబడి నవ్వుతోంది! ★